## పేదలకు వరం సీఎం సహాయనిధి



ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , జనవరి 1: పేదరికంతో పాటు అనారోగ్యానికి గురవుతున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆపదలో ఆపన్న హస్తంలా ఆదుకుంటూ ఆరోగ్య భరోసాను కల్పిస్తున్నదన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీకి చెందిన అనురాధకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ. 1.50 లక్షల ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే గాంధీ సోమవారం తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆదుకుంటుందన్నారు. సీఎం సహాయ నిధితో కార్పొరేట్ దవాఖానలలో ఉచిత వైద్య సేవలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో రంగారావు ,కాశీ, నాగేశ్వర్, ఖయ్యూమ్,కృష్ణ, రఫిక్ పాల్గొన్నారు.

## బెటాలియన్‌లో నూతన సంవత్సర వేడుకలు



నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ మురళీకృష్ణ కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
–జూబ్లీహిల్స్,జనవరి1:

## లిఫ్ట్ గుంతలో పడి ఒకరి మృతి

మాదాపూర్, జనవరి 1 : నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి అయ్యప్ప సొసైటీలో నిర్మాణంలో ఉన్న భవనం లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందినట్లు వచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న క్లూస్ టీం మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు.

## మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్..వ్యక్తి మృతి

బాలానగర్, జనవరి 1 : విధులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వ్యక్తిని మద్యం మత్తులో బైక్ నడిపిన పోలీస్ కానిస్టేబుల్ ఢీ కొట్టాడు. ఈ ఘటనలో పాదచారి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. బాలానగర్ పోలీసుల కథనం ప్రకారం.. సాయినగర్‌లో నివాసి కందు కూరి దుర్గయ్య (58) అమీర్‌పేటలోని ఓ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్నాడు. రోజువారిగా ఆదివారం కూడా ఉదయం డ్యూటీకి వెళ్లి.. తిరిగి ఇంటికి రాత్రి 10.40 గంటల సమయంలో వస్తున్నాడు. బాలానగర్ మెజిస్టిక్ గార్డెన్ సమీపంలో అతడు వెళ్తుండగా.. మద్యం మత్తులో బైక్‌పై వచ్చిన ఎస్ఆర్‌నగర్ పీఎస్ కానిస్టేబుల్ మల్లికార్జున్ ఢీ కొట్టాడు. దుర్గయ్యకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బాటసారులు ఇచ్చిన సమాచారంతో ప్రమాదస్థలానికి వచ్చిన పోలీసులు.. దుర్గయ్య వద్ద లభించిన ఆధారాలతో అతడిని గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దుర్గయ్య కుమారుడు ప్రవీణ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాడు. ప్రమాదానికి కారణమైన కానిస్టేబుల్‌ను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.. తీవ్ర గాయాలైన దుర్గయ్యను దవాఖానకు తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్లుగా తెలిపారు. మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## గర్ల్ ఫ్రెండ్ మండి భవనంలో అగ్ని ప్రమాదం

కొండాపూర్, జనవరి 1 : మాదాపూర్‌లోని దుర్గంచెరువు మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న గర్ల్ ఫ్రెండ్ మండి భవనంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు మాదాపూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ వైర్లు దగ్గమై మంటలు చెలరేగినట్లు ఫైర్ అధికారి జగన్మోహన్ తెలిపారు.

# ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ వెంకటేష్ ,పార్టీ శ్రేణులు



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టెలివిజన్ టెక్నీషియన్స్ అండ్ డిజిటల్ మీడియా వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు

మియాపూర్ , జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆల్విన్ కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్ డివిజన్ల కార్పొరేటర్లు వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్‌రావు, మాధవరం రోజాదేవి సహ పార్టీ నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు , సేవా సంస్థల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే గాంధీ నివాసానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆంగ్ల సంవత్సరం ప్రజలందరికీ సకల శుభములను కలుగ జేయాలని ఆకాంక్షించారు.

### ఎమ్మెల్యే మాగంటికి శుభాకాంక్షలు

బంజారాహిల్స్,జనవరి 1: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు టెలివిజన్ టెక్నీషియన్స్ అండ్ డిజిటల్ మీడియా వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు ఎమ్మెల్యే మాగంటిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రగడ్డ, జనవరి 1: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బోరబండ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలు సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ సీనియర్ నేత విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, సాయిబాబానగర్ సంక్షేమ సంఘం నాయకులు రమేష్‌నాయక్, ఏడీ మధు, మోహన్, కుమారి, అలివేలు తదితరులు మాగంటిని కలిసిన వాళ్లలో ఉన్నారు.



ఎమ్మెల్యే మాగంటికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు



ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు



ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ రోజాదేవిరంగారావు

## సెల్లార్ తవ్వకాలతో అపార్ట్‌మెంట్లకు బీటలు

కొండాపూర్, జనవరి 1 : ఓ నిర్మాణ సంస్థ పనులతో పక్కనున్న మరెన్ని అపార్ట్‌మెంట్‌లకు సమస్యగా మారింది. చందానగర్‌లో డివైన్ హోమ్స్ సెల్లార్ తవ్వకాలతో పక్కనే ఉన్న గిరిజా మార్వెల్ అపార్ట్‌మెంట్లు బీటలు పారుతున్నాయి. సదరు నిర్మాణ సంస్థ సరైన నిర్మాణ చర్యలు తీసుకోకుండా ఇష్టానుసారంగా సెల్లార్ తవ్వకాలను కొనసాగిస్తుండడంతో తమ అపార్ట్‌మెంట్లు కుంగడంతో పాటు బీటలు పారుతున్నట్లు అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏ, బీ బ్లాక్‌లలో పగుళ్లు ఏర్పడ్డాయని, ఇలాగే కొనసాగితే మిగతా బ్లాక్‌లలో సైతం పగుళ్లు ఏర్పడి ప్రమాద స్థాయికి చేరే అవకాశముందని వాపోతున్నారు. సరైన నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టడం తోనే సమస్య ఏర్పడిందని, సంబంధిత అధికారులు



గిరిజా మార్వెల్ అపార్ట్‌మెంట్‌కు పడ్డ బీటలు

వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటున్నారు. నిర్మాణాల మధ్య సెల్లార్ల తవ్వకాలు అనుమతులిచ్చే ముందు సరైన నియమాలు పాటించేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. సమస్యపై చందానగర్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు



జూబ్లీహిల్స్,జనవరి1: నూతన సంవత్సరం 2024 ను పురస్కరించుకుని సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గీతా గౌడ్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం కలిసి మొక్కను అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు సోమవారం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో శ్రీదేవి ముంగర శిష్య బృందం కూచిపూడి నృత్యాలు, సాహిత్య రామ్ కుమార్ బృందం, మాధవి మారెళ్ల పూడి తిల్లాన ఆర్ట్స్ అకాడమీ శిష్య బృందాల భరత నాట్య నృత్య ప్రదర్శనలు అలరించాయి.



## కెనడా వెళ్తున్నానని చెప్పి..

మాదాపూర్: కెనడా వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మాదాపూర్‌లోని ఇజ్జత్ నగర్‌లో నివాసం ఉంటున్న మహేశ్ గతేడాది అక్టోబర్ 22న కెనడా వెళ్లేందుకు తండ్రి ఎల్లయ్యను రూ. 2 లక్షలు అడిగాడు. తండ్రి డబ్బులు ఇవ్వడంతో కుమారుడు కెనడా వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. కొన్ని రోజుల తరువాత వాట్సాప్ ద్వారా ఫోన్ చేసి మళ్లీ డబ్బులు అడిగాడు. దీంతో అనుమానం వచ్చిన తండ్రి ఇంట్లో వెతకగా కుమారుడి పాస్‌పోర్ట్ కనిపించింది. దీంతో తన కుమారుడు కెనడాకు వెళ్లలేదని నిర్ధారించుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.